# లైన్ క్లియర్

- పావులూరి శివాజీ

మా ఇంట్లో ఓ చిన్న రూమ్ ఖాళీగా పడి వుంది. అంత చిన్న గదిలో ఫ్యామిలీ అంటే దిగరు. బ్యాచిలర్స్ అయితే సక్రమంగా ఉంటారో లేదో అన్నది అమ్మానాన్నల సందేహం. పైగా ఇంట్లో వయసొచ్చిన ఆడపిల్లని. చాలారోజులపాటు దాన్నసలు అద్దెకు ఇవ్వడమా వద్దా అన్న సందిగ్ధం లోనే వుంచి చివరకు ఇవ్వడానికే ఖాయం చేసారు.

నేనో అట్టముక్కపైన వైట్ పేపర్ అంటించి 'టు లెట్' బోర్డు పెట్టాను. అది పెట్టిన నాలుగురోజులకి బ్లాక్ ప్యాంట్ మీద బ్లూ కలర్ చెక్స్ షర్ట్, తెల్లని ఛాయ, ఆరడుగుల ఎత్తుకు తగ్గ లావు, పాతికేళ్ళు నిండీ నిండని ఆ మనిషిని చూస్తే ముఖంలో ఏదో వెలుగు.

"టు లెట్ బోర్డు చూసి వచ్చానండీ" అన్నాడు.

అమ్మకింకా వంట పనులు పూర్తికాలేదు. నాన్న స్నానానికెళ్లారు.

"రండి" అంటూ సందులోనుంచి తీసుకెళ్లి చివర్న వున్న రూమ్ చూపించాను.

"రెంట్ ఎంతండీ?" అన్నాడు.

"ముందు రూమ్ చూడండి. నచ్చితే నాన్న గారు వివరాలు మాట్లాడతారు"

"ఇందులో తీసి పడెయ్యడానికి ఏముందండీ? ఒక్కడ్నీ.. ఎంచక్కా సరిపోతుంది" అన్నాడు.

తిరిగి రూమ్ డోర్ వేసి గడియ పెట్టాను.

అతను నా వెనుకే నడిచాడు.

నాన్న బాత్రూమ్‌లోంచి బయటకి వస్తూ "ఎవరూ?" అన్నాడు.

విషయం చెప్పాను. నాన్న వివరాలు అడిగారు.

పేరు మనోహర్. ఈమధ్యనే ఎమ్‌బిఎ అయిందిట. దగ్గర్లోనే ఏదో కంప్యూటర్ జాబ్ చేస్తున్నానని చెప్పాడు.

నాన్న చెప్పిన రూమ్ రెంట్‌కి అతను సరేనన్నాడు. వారంరోజులకు సామాన్లతోపాటు రూమ్‌లోకి దిగాడు మనోహర్.

★★★

నాకు మా ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఒక్కటీ సరిగ్గా కుదరడంలేదు. ఈ అరేంజ్‌డ్ మేరేజెస్ మీద నాన్నకి నమ్మకం ఎక్కువ. అబ్బాయి, అమ్మాయి ఒకళ్లనొకళ్ళు ఎక్కువగా తెలుసుకోవడానికి వీలుంటుందనీ, అలా అని హద్దులు మీరే ప్రేమికులంటే కోపమూ లేకపోలేదు. నాన్న ఆలోచనలు ముందు తెలిసిపోవడంచేతనేమో నా వయసుకు మరింత రెక్కలొచ్చి మనసుకు దగ్గరయ్యే మనిషి కోసం వెదికి నిష్ఫలం అయ్యాయి.

మనోహర్ నడవడికలోనూ, చేతల్లోనూ అదో ప్రత్యేకత. తను చేసే ఏ పనివల్ల ఇతరులు ఇబ్బంది పడకూడదనుకుంటాడు. అతడు గదిలో రాత్రి తొమ్మిదిన్నరకు లైట్లు ఆరిపోతాయి. వేకువఝాము నాలుగుగంటలకు లేస్తాడు. ఉదయం ఆహారం చేదు (పచ్చి కాకరకాయ)తోనే మొదలుపెడతాడు. కష్టాల్ని స్వాగతించే మనస్తత్వం అని చెప్పకనే తెలిసిపోతోంది.

సున్నితత్వం, అణకువ, ముఖ్యంగా పద్ధతి ప్రకారం నడుచుకునే మనిషి. సిగరెట్లు, విస్కీలు, పబ్‌లకు, పార్టీలకు అతీతమైన మనిషి. ఇంతటి సుగుణాలు కలిగిన ఈ అబ్బాయిని చూస్తే ఏ ఆడ మనసయినా వూరుకుంటుందా? సమయం కలిసొచ్చిన ప్రతిసారీ ఆ చూపులకి నా కళ్ళూ జతకట్టి...

★★★

"రానురాను నీకు నాపైన స్వతంత్రం మరీ ఎక్కువైపోతోంది. ఇప్పట్నుంచే అధికారం చెలాయించాలనుకుంటున్నావా?" అన్నాడు ముఖం బిగించి.

"నేనేం అన్నాన్రా?"

"అదిగో ఆ ఒరే అన్నమాటే?"

"తప్పేం వుంది. ప్రేమికులన్నా, భార్యాభర్తలన్నా మంచి ఫ్రెండ్స్‌లా ఉండాలని నువ్వేగా చెప్తావు. ఫ్రెండ్స్ అన్నాక ఒరే ఒరే అనుకోరా ఏమిటి?"

"ఆ ఫ్రెండ్షిప్పు పెళ్లయ్యేదాకా దాచిపెట్టు"

"ఊహూ నేను దాచను"

"దాచవా?"

"ఊహూ..."

"వుండు నీ పని చెప్తా" అంటూ నా చేయి పట్టుకుని మనోహర్ తనవైపు లాక్కోబోయాడు.

తప్పించుకున్నాను.

"రేయ్ నువ్వు శృతి మించుతున్నావు?"

"నువ్వు మించితే తప్పులేదా?"

"నీతో పలకను పో..."

"పలక్కపోతే మాను. ఈ ఒక్క విషయం విను"

"ఏంటి?"

"ఆమధ్య నువ్విచ్చిన ఫొటో మా ఇంటికి పంపించాను. మా ఇంట్లో వాళ్ళు పెళ్లికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసారు"

"రియల్లీ..." ఎగిరి గంతేసినంత పనిచేసాను నేను.

మనోహర్ పెదాలమీద విజయగర్వంతో కూడుకున్న చిరునవ్వు.

మా ప్రేమ విషయం అమ్మానాన్నలకి కూడా తెలుసు. ఇక అటువైపునుంచే వేచి చూడడం అనుకున్నాం.

మనోహర్ ముందు తానుగా విషయం చెబుతానన్నాడు. రిజల్ట్ వచ్చేసింది. నా మనసంతా తేలిపోతున్నట్లు అనిపించింది. ప్రపంచంలో ప్రేమికులందరికీ ఇలాగే లైన్ క్లియర్ అయితే ఎంత బాగుండుననిపించింది.

పెళ్లి విషయాలు మాట్లాడడానికి నాన్నని తన వెంట తీసుకువెళ్లాడు మనోహర్ వాళ్ల ఊరుకి.

★★★

బంతి నారుపోద్దాం అని సందులోకి వెళ్లాను. మనోహర్ తాలూకు ప్రతి మూవ్‌మెంట్ నాకిష్టం. అతని రూమ్ వంక చూసాను.

పూర్‌మేన్! రూమ్‌కి తాళం వేసాడుగానీ అది సరిగ్గా పడిందో లేదో చూసుకోలేదు. ఇక్కడ దొంగల బెడదేంలేదు కాబట్టి పెద్దగా ఇంపార్టెన్స్ ఇవ్వాల్సిన పనిలేదు అనుకుని ముందుకెళ్ళబోయాను.

నా మనసులో ఓ కొంటె ఆలోచన చేరింది... అతనొచ్చేసరికి అతని రూమ్‌లో ఏదైనా పజిల్

అరేంజ్ చేద్దామని.

థీమ్ కోసం ఆలోచించాను. తట్టలేదు. రూమ్ లోకెళ్తే ఐడియా దొరుకుతుందని మామధ్య ఆపాటి స్వాతంత్ర్యం వుంది కాబట్టి లోపలికెళ్లాను.

షెల్ఫ్‌నిండా బుక్స్ పేర్చి వున్నాయి. చిన్న రూమ్ అయినా చక్కటి సీనరీస్. అతడి టేస్ట్ నాకు తెలుసు. అందుకే అతనిమీద అపారమైన ప్రేమ.


అప్రయత్నంగా నా దృష్టి అతని డైరీ మీద పడింది.

లిమిట్ సెన్స్ తప్పుతున్నానేమో అన్పించింది. ఇలాంటి విషయాల్లో నాకు ఆరాటం ఎక్కువ. కాబోయే భర్త కాబట్టి అతని మనసు తెలుసుకోవడం తప్పు కాదేమో అని సమర్థించుకున్నాను. డైరీలో పేజీలవెంట నా కళ్ళు పరుగులు తీసాయి.

సెప్టెంబర్ 24.

"నేను నా భార్యని వదిలేసిన రోజు. నన్ను బయటకి వెళ్ళనిచ్చి నా భార్య పరాయివాడితో కులుకుతుండడం తట్టుకోలేకపోయాను. ఆ నిజం బయటపడ్డాక తను బుకాయించే ప్రయత్నంచేసింది. వీలు చూసుకుని దాన్ని చంపేయాలన్నంత కసి. కానీ నాకంత చేతకాదు. అందుకు దాన్ని వదిలించేసుకుని కనిపించకుండా వచ్చేసాను. మళ్లీ నా దైనందిన జీవితం... ఓ కొత్త జీవితం ఏర్పరచుకోగలుగుతున్నానన్న ఆశ!"


ఆ పేజీ చదవడం పూర్తయ్యాక షాక్ నుంచి ఎప్పటికి తేరుకున్నానో నాకే తెలియదు. దాన్ని మళ్ళీ మళ్ళీ చదివాను.





## కొత్త అవతారం

కొంమంది అలవాట్లు వారికి ఆరోగ్యాన్ని, అంతకుమించిన ఆనందాన్ని ఇస్తాయి. ఎన్నేళ్ళు గడిచినా చెక్కుచెదరని అందంతో అందర్నీ అలరించే అలనాటి నటి రేఖ ఇప్పుడో కొత్త అవతారంతో అలరించనుంది. గోవింద్ మీనన్ నిర్మాత సారథ్యంలోని కొత్త చిత్రం 'బచ్‌కే రెహనాదె బాబా' చిత్రంలో ఆమె నేపథ్యగాయనిగా అందర్నీ ఆకట్టుకోనుంది. ఈ చిత్ర సంగీత దర్శకుడు అనూమాలిక్ స్వయంగా రాసిన ఈ పాటని ఆమె పాడి తన చిరకాలవాంఛని తీర్చుకోనుంది. 'ఈ చిత్రంలో ఆమె పాడే పాట తప్పక హిట్ అవుతుంది. ముందు ముందు ఆమె పాడే పాటలకి ఇది నాంది కాబోతోంది' అంటున్నాడు మాలిక్. బెస్టాఫ్‌లక్ రేఖ!




వెనుక వదిలేసిన పేజీలు పట్టి పట్టి చదివాను. మొత్తానికి సారాంశం ఒక్కటే. అతనికి ఒకసారి పెళ్ళయింది. భార్య మంచిది కాక తనని వదిలించుకున్నాడు. అతడు కోరుకున్న కొత్త జీవితం ఇప్పుడు నాతో...!

నా కాళ్లకింద భూమి కదిలింది. కళ్ళు బైర్లు కమ్మాయి. ఆకాశం విరిగి ఒక పెద్ద రాతి ఫెళ్లయి నా నెత్తిన పడ్డంత బరువు... కుప్పకూలిపోయాను.

★★★

"ఫొటో చూసాం. పైగా మావాడు ఇష్టపడుతున్నాడు కనుక ఇక మేం చూడాల్సిన పనిలేదు' అని మనోహర్ తల్లిదండ్రులు అనడంతో ఏకంగా ముహూర్తాలు ఖాయం చేసేసారు.

కూతురు పెళ్లి ఇంత సజావుగా సాగిపోతున్నందుకు అమ్మానాన్నల సంతోషం చెప్పరానిది. అలాంటి వాళ్లకి ఈ విషయం చెబితే...

అమ్మా నాన్నల వయసులు పెరిగాయికానీ మనసులు మాత్రం పసితనం వీడలేదు. వాళ్ల ఆనందాన్ని ఒక్కసారిగా తుంచడం ఎలా?

మనోహర్‌కి ఒకసారి పెళ్లయిందన్న బాధకన్నా ఆ నిజం దాచి తన ఆదర్శ అభినయంతో నన్ను తనవైపుకి తిప్పుకున్నాడన్న బాధే నన్ను కలచివేస్తోంది.

"ఏంటి ఒక్కసారిగా బిగిసిపోయావు. పెళ్లి అనగానే సిగ్గొచ్చి చేరిందా'' అన్నాడతను సమయం చూసి.

డామిట్, రాస్కెల్, మేకవన్నెపులి, తేనెపూసిన కత్తి.

పెళ్లి సంగతి దేవుడెరుగు... ఆనక జీవితాంతం బాధపడేకంటే అమ్మానాన్నలకి తాత్కాలిక బాధ కలిగించినా సరే వీడ్ని కటకటాల ఊచలు లెక్క పెట్టించేవరకూ వదలకూడదనుకున్నాను. ఆలస్యం కూడా అనర్థాలకు దారి తీస్తుందని తిన్నగా పోలీస్‌స్టేషన్‌కు బయలుదేరాను.

దారిలో పోస్ట్‌మేన్ ఎదురొచ్చాడు. మావైపు ఆ ఒక్కటే లెటర్ ఉండడం చేత ఇంటి నెంబర్ చూసి చేతికిచ్చి వెళ్లిపోయాడు.

ఆ మనోహర్ గాడికే లెటర్. ఇంకో పెళ్లిచేసుకుంటే కేసు వేస్తానని బహుశా మొదటి భార్య రాసిందేమో! విప్పి చదివాను. పై లైనులో డేటు కింద బాంబే అని వుంది.

ప్రియమిత్రుడు మనోహర్‌కి,

ఉభయ కుశలోపరి. నిజంగా ఆత్మహత్య చేసుకోవాలన్న తలంపునుంచి బయటపడేసి నాకు జీవితం పట్ల ఆత్మవిశ్వాసం కల్పించావు. ఫలితంగా భార్యని వదిలించుకుని కొత్త జీవితం ఏర్పరచుకున్నాను. ఈ జీవితం బాగుంది. ఇక్కడి వాతావరణానికి బాగా అలవాటుపడ్డాను. ఇప్పుడిప్పుడు పాత జ్ఞాపకాల నుంచి బయట పడుతున్నాను. అన్నట్లు నేను వెళ్తూ నీ దగ్గర దాచిన డైరీ ఇక నాకు అవసరంలేదు. దాన్ని వెంటనే కాల్చేసేయ్. నీకు మీ ఇంట్లో సంబంధాలు ఏమైనా చూస్తున్నారా? నాలా కాకుండా నీకు నిన్నర్థం చేసుకునే మంచి భార్య దొరకాలని, నీ భావి జీవితం ఆనందమయం కావాలని కోరుకుంటున్నాను.

ఇట్లు
నీ మిత్రుడు
సంజీవి

అంటే... ఆ డైరీ మనోహర్‌ది కాదు, ఈ సంజీవదన్నమాట.

ఓ మైగాడ్! ఎంత పొరపాటు చేసేదాన్ని. ఏమిటీ పరీక్ష?

మళ్లీ కళ్ళు బైర్లు కమ్ముతాయేమోనని చెవులు మూసుకుని పక్కనే సిమెంట్ అరుగుమీద కూర్చున్నాను.

నా తొందరపాటుతనానికి నాకే సిగ్గేసింది. అపార్థం స్థానే పశ్చాత్తాపం... మనోహర్‌ని ఎన్ని మాటలనుకున్నాను. ఇంతలోనే తనో ఛీటర్ కింద జమ కట్టాను. ఈ అంతటికీ ప్రాయశ్చిత్తం...

★★★

"చెప్పండి బాబూ...ఏం చెయ్యమన్నా చేసేస్తాను'' అన్నాను నిస్సిగ్గుగా.

"ఒట్టు?''

"మీమీద..''

"ఏదీ.. ఆ పిడికెడు నడుం ఒక్కసారి నా గుప్పిటకు చిక్కించూ..''

నా బుగ్గలు ఎరుపెక్కడం అతడి కళ్లల్లోంచి సైతం కన్పిస్తోంది.

అప్పుడంటే అతను కవ్వించిన ప్రతిసారీ పెళ్లి కాలేదని అడ్డుపేశాను. ఇప్పుడైతే ఊరుకుంటాడా?

అమాంతం నన్ను తనపైకి లాక్కున్నాడు.

"ఇంతకీ మీ మిత్రుడి డైరీ కాల్చేశారా...'' అన్నాను అతడి బుగ్గపైన పంటిగాటు పెడుతూ.

"ఏం కాల్చెయ్యకపోతే మళ్ళీ పోలీస్‌స్టేషన్‌కెళ్తావా..'' అన్నాడు.

"యూ..రాస్కెల్..'' అంటూ అతడి బిగి కౌగిలిలో నేను బందీనయ్యాను.

★